క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం జాతీయ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సదస్సు సమన్వయకర్తలు రామకృష్ణ, భరత్‌రాజ్ మాట్లాడుతూ.. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ యుగంలో విజ్ఞాన శాస్త్రాలకు ఉన్న అవకాశాలు, అవరోధాలు' అనే అంశంపై నవంబర్ 27న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో జరిగే ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న విద్యావంతులు పాల్గొని, ఫలవంతమైన చర్చలు జరిపి, భవిష్యత్ నిర్దేశిత తీర్మానాలను చేయాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ రంగరత్నం, రాజేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన



మోపాల్: మండలకేంద్రంలో చిన్నారులకు పోస్టల్ సేవలపై బీపీఎం, పోస్ట్‌మన్ సోమవారం అవగాహన కల్పించారు. పోస్టాఫీస్‌కు వెళ్లి పెన్షన్ ఇచ్చే విధానం, ప్రభుత్వ పథకాలు సుకన్య సమృద్ధి యోజన, ఆర్‌పీఎల్‌ఐ, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, తదితర అంశాలపై చిన్నారులకు వివరించారు.

కేజీబీవీ సిబ్బంది ముందస్తు అరెస్ట్

మోపాల్: కేజీబీవీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు పలువురిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. కాగా కేజీబీవీ నాన్ టీచింగ్ కార్మికులు, నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటి, ప్రజాసంఘాల నాయకులు మురళీ ఒక ప్రకటనలో తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



నిజామాబాద్‌నాగారం: లయనిజంలోకి కొత్త వారిని తీసుకురావడంతోపాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ ఇరుకుల వీరేశం అన్నారు. నగరంలోని సందీప్ గార్డెన్స్‌లో సోమవారం లయన్స్ నిజామాబాద్ జోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. క్లబ్ బాధ్యులు నూతన సభ్యత్వంపై దృష్టిసారించాలన్నారు. క్లబ్ ప్రతినిధులు ఉదయ సూర్యభగవాన్, లక్ష్మినారాయణ, యాదగిరి, నాగేశ్వరరావు, చింతల గంగాదాస్, బొబ్బ నర్సింహరావు, దారం భూమన్న పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఖలీల్‌వాడి: నగరంలోని దేవి నవరాత్రుల సార్వజనిక్ సమితి (సిర్నాపల్లి గడి) 15వ వార్షికోత్సవం, దసరా ఉత్సవాల కరపత్రాలను సోమవారం నగరంలో సీపీ సాయిచైతన్య ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, ఉపాధ్యక్షులు బుస్సాపూర్ శంకర్, కోశాధికారి లింగయ్య, ప్రధాన కార్యదర్శి శిలా శ్రీనివాస్, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,16,000	వెండి(కిలో)	1,41,500
22 క్యారెట్స్	1,07,115	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	40	80
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	50	100	దోసకాయ	25	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	80	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	35	70
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	70	140	చామగడ్డ	30	60
కొత్తిమీర	50	100	చిక్కుడుకాయ	30	60
పుదీనా	50	100	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	100			

–సుభాష్‌నగర్

పనులు పూర్తి.. బిల్లులు పెండింగ్..

- నగర మున్సిపల్‌లో రూ. 10 కోట్ల వరకు రావాల్సిన బకాయిలు
- ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు





నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులను పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం రావడం లేదు. సుమారు రూ.10 కోట్ల వరకు పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో బిల్లుల కోసం నిత్యం వారు బల్దియా చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

60 మంది కాంట్రాక్టర్లు...

బల్దియాలో పనులు చేయాలంటే లైసెన్సు కలిగి ఉండాలి. అలాంటి కాంట్రాక్టర్లే టెండర్లలో పాల్గొని పనులు దక్కించుకోవాలి. తర్వాత నిర్దేశించిన మేర పనులు పూర్తిచేయాలి. చేసిన పనులను మున్సిపల్ ఇంజినీరింగ్ ఏఈలు, తర్వాత డీఈలు పరిశీలిస్తారు. వారి ఫార్మాలిటీస్ పూర్తిచేస్తేనే పనులకు సంబంధించిన ఎంబీలు చేస్తారు. తర్వాత వాటికి సంబంధించిన బిల్లుల కోసం మున్సిపల్ అధికారులకు సమర్పిస్తారు. ప్రభుత్వం సూచించిన ఖాతాల్లోంచి బిల్లులు చెల్లిస్తారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 మందికి పైగానే లైసెన్సుడ్ కాంట్రాక్టర్లున్నారు. వీరిలో కేవలం 20 మంది మాత్రమే రెగ్యులర్‌గా పనులు చేస్తున్నారు. కొందరు పనులు దక్కించుకుని సబ్‌కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పుతున్నారు. బిల్లుల సమయంలో మాత్రమే వారి పేరుమీదనే బిల్లులు మంజూరుచేస్తారు.

రెండేళ్లు గడుస్తున్నా..

14వ ఆర్థిక సంఘం నిధుల్లోంచి కేటాయించిన పనులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, పట్టణ ప్రగతి, స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పలు రకాల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. వాటిలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, పెద్దనాళాల పూడిక తీతలు, మరమ్మతులు, పబ్లిక్ టాయ్‌లెట్లు వంటి పలు రకాల నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో వారు పనులు పూర్తిచేశారు. రెండేళ్లు దాటుతున్నా వాటికి సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు రావడం లేదని పలువురు గుత్తేదార్లు వాపోతున్నారు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు బల్దియా చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

రూ. 30లక్షల వరకు రావాలి..



మా డివిజన్‌లో సీసీ డ్రెయిన్ పనులు చాలా చేశాను. అప్పటి పాలకమండలి అనుమతితోనే పనులు దక్కించుకున్న. పనులు పూర్తయి రెండేళ్లు దాటింది. నాకు రూ.30 లక్షల వరకు బిల్లులు రావాల్సింది. పనుల కోసం డబ్బులు బయట నుంచి తీసుకువచ్చాను. వాటికి వడ్డీ కట్టలేకపోతున్నా. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు ఇప్పించాలి.

–మహ్మద్ అబ్దుల్ మునీబ్, మున్సిపల్ కాంట్రాక్టర్

బల్దియా చుట్టూ తిరుగుతున్నా..



నాకు రూ.80 లక్షల వరకు బిల్లులు రావాల్సింది. అప్పటి అధికారులు పనులు వేగవంతంగా, నాణ్యతతో చేయాలని ఒత్తిడిచేశారు. పనులు పూర్తయిన తర్వాత బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి రాగానే ఇస్తామని చెబుతున్నారు. పాత బిల్లులే రాలేదు. కొత్త పనులు ఎట్లా చేస్తాం. బిల్లుల కోసం బల్దియా చుట్టూ నిత్యం తిరుగుతున్న.

–పవర్ పండరి, మున్సిపల్ కాంట్రాక్టర్

సంబురంగా బతుకమ్మ వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: నగరంలో బతుకమ్మ వేడుకలు సంబురంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిజామాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ మహిళా సిబ్బంది వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో బతుకమ్మలను ఏర్పాటు చేసి, మహిళా ఉద్యోగినులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.



నిజామాబాద్ బస్టాండ్‌లో బతుకమ్మ ఆడుతున్న ఆర్‌ఎం జ్యోత్స్న, ఆర్టీసీ మహిళ సిబ్బంది

అలాగే గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. నగరంలోని హమాల్‌వాడీ అంగన్‌వాడీ కేంద్రంలోనూ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.



హమాల్‌వాడీ అంగన్‌వాడీ కేంద్రంలో..



గిరిరాజ్ కళాశాలలో..



నగరంలోని కన్యకాపరమేశ్వరాలయంలో..



హమాల్‌వాడి సాయిబాబా ఆలయంలో..

సంక్షిప్తం

తెయూలో ఏబీవీపీ హెల్ప్‌డెస్క్

తెయూ(డిచ్ పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఐసెట్ ఎంట్రెన్స్ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో జరుగుతున్న అడ్మిషన్లకు సంబంధించి క్యాంపస్‌కు వచ్చే విద్యార్థులకు హెల్ప్ డెస్క్ ద్వారా ఏబీవీపీ నాయకులు సహకారం అందించారు. నాయకులు సమీర్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ముల్లంగి వీడీసీ నూతన కమిటీ ఎన్నిక



వీడీసీ అధ్యక్షుడు లోలం నితిన్

డిచ్‌పల్లి: మండలంలోని ముల్లంగి (ఐ) గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా లోలం నితిన్, ఉపాధ్యక్షులుగా నంగి శ్రీనివా స్, క్యాషియర్‌గా మాడబోయిన శేఖర్, అకౌంటెంట్ గా రుద్రాక్ష ,పెద్ద లింబాద్రి, సభ్యులుగా సూదం కిషన్, సోమనోళ్ల రవి, సాయిలు, బాల్‌రెడ్డి, సందీప్, లక్ష్మణ్, అబ్బయ్య, రమేష్ ఎన్నికయ్యారు.

నాణ్యమైన విద్యను అందిస్తాం



డిచ్‌పల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్ర విఠల్ అన్నారు. కళాశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతను సాధించాలని కోరారు. అధ్యాపకులు బాలాజీ, అర్చన, ప్రవీణ్ కుమార్, తిరుపతి, సదానంద్, సుజాత, స్రవంతి, శ్రీనివాస్, ఆర్కే రెడ్డి, శ్రీలక్ష్మి, లిఖిత, నరేష్ పాల్గొన్నారు.

మైలారం తొలి సర్పంచ్ మృతి



సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ తొలి సర్పంచ్ మద్దగారి రాజపండరి అనారోగ్యంతో సోమ వారం మృతి చెందారు. రాజపండరి 1981 నుంచి 1986 వరకు తొలి సర్పంచ్‌గా సేవలందించారు. అనంతరం సిరికొండ పీఏసీఎస్ చైర్మన్‌గా 1987 నుంచి సేవలందించారు. సొసైటీ చైర్మన్‌గా రెండుసార్లు పని చేశారు. మృతుడికి భార్య నాగవ్వతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా, చిన్న కుమారుడు గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ సిటీ : ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు ప్రభుత్వ ప్లీడర్ (పీపీ)గా బాధ్యతలు చేపట్టిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు దయాకర్‌గౌడ్‌ను సోవారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ నాయకులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ఎస్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు కెతావత్ యాదగిరి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, రవీందర్ నాయక్ తదితరులున్నారు.

చెన్నై వర్క్‌షాప్‌లో జిల్లా వైద్యుడు



నిజామాబాద్‌నాగారం: చెన్నైలో స్పోర్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిరోస్ వర్క్ షాప్, సీఎంఈ కార్యక్రమంలో జిల్లాకి చెందిన వైద్యుడు అంకం గణేష్ పాల్గొని, ఆర్థోపెడిక్ విద్యార్థులకు మిరోస్ టెక్నిక్‌పై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ముద్దాయిలకు శిక్ష పడేలా సలహాలు ఇవ్వాలి



నిజామాబాద్‌నాగారం: మాదక ద్రవ్యాల కేసుల్లో ముద్దాయిలకు శిక్ష పడేలా న్యాయసలహాలు ఇవ్వాలని ప్రాసిక్యూషన్ డిప్యూటి డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య అన్నారు. నగరంలో సోమవారం జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఆయన సమావేశం నిర్వహించి, పలు అంశాలను వివరించారు. అనంతరం ఇటీవల నూతనంగా నియమితులైన కామారెడ్డి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనిని సన్మానించారు. జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పీసు రాజేశ్వర్ రెడ్డి, బంటు వసంత్, నర్సింహారెడ్డి, సూర్య కుమార్, నిమ్మ దామోదర్ రెడ్డి, శ్యాంరావు, శ్రీనివాస్ ఖాందేష్, రామకృష్ణ, రహీముద్దీన్, భూసారపు రాజేష్ గౌడ్, రజని తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వాక్ ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని తెలంగాణ అమర వీరుల పార్క్‌లో సోమవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆయుర్వేద వాక్‌ను జిల్లా ఆయుష్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ గంగాదాస్ జెండా ఊపి ప్రారంభించారు. నేడు అర్సపల్లి గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వైద్యులు తిరుపతి, వందన రెడ్డి, ఫార్మసిస్టులు న్యవనంది, పురుషోత్తం, ఉమా ప్రసాద్, సిబ్బంది రమేష్, భిక్షపతి, తైక్వాండో క్రీడాకారులు, కోచ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ టోర్నీకి ఎంపిక

నిజామాబాద్‌నాగారం: సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ టోర్నీకి జీజీకళాశాల డిగ్రీ ఫస్టియర్ విద్యార్థి బి జైపాల్ ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి 25వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో జరిగే టోర్నీలో పాల్గొననున్నారు.

హెచ్‌సీఏ లీగ్ టోర్నీకి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: హెచ్‌సీఏ లీగ్ టోర్నీకి జిల్లాకు చెందిన మహిళా క్రికెటర్ హేమలత ఎంపికైనట్లు జిల్లా కోచ్‌లు లలిత్‌రెడ్డి, బాగార్తి బాగారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు ఆమెకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

'గాంధీ గంజ్' అభివృద్ధికి కృషి



సుభాష్‌నగర్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో గాంధీ గంజ్‌ను విస్మరించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేపడుతున్నామని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని గాంధీగంజ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్, సిబ్బంది వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ గాంధీగంజ్‌లో సీసీ డ్రెయిన్లు, రోడ్లు, ప్యాచ్‌వర్కులు చేపడుతున్నామన్నారు. ఇటీవల గడియారం బిగించామని, గాంధీ గంజ్‌కు పూర్వవైభవం కోసం తనవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డైరెక్టర్లు మారుతీ, మల్లేశ్, సిబ్బంది ఉన్నారు.

దుర్గామాతా ఆలయంలో ప్రత్యేక పూజలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గాంధీగంజ్‌లోని మాతా ఆలయంలో చైర్మన్ ముప్ప గంగారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

కొలువుదీరిన దుర్గమ్మ




నగరంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో సోమవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాకేంద్రంతోపాటు ఆయా మండలాలు, గ్రామాల్లో వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి, దుర్గామాత్ర విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు అమ్మవార్లను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం మండపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గాయత్రినగర్‌లో కొలువు దీరిన అమ్మవారు



వినాయకనగర్‌లో విద్యుత్ లైట్ల సెట్టింగ్



పడకల్‌లో దుర్గాదేవి మాల ధరించిన భక్తులు



గద్కోల్‌లో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



నల్లగుట్ట తండాలో..



నగరంలో మండపానికి తరలుతున్న అమ్మవారు



దేవిమాత ఆలయంలో అమ్మవారి మూలవిరాట్



కోటగల్లి మైసమ్మ ఆలయంలో అమ్మవారికి హారతి ఇస్తున్న మహిళలు



నగరంలోని దేవిమాత ఆలయంలో భక్తుల సందడి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్ నాగారం: 'స్వస్థ నారీ సశక్త్ పరివార్' వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. నగరంలోని చంద్రశేఖర్‌కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వైద్య శిబిరం ఈనెల 29 వరకు కొనసాగుతుందని కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ సుజాత, నర్సింగ్ ఆఫీసర్స్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ నారీ సశక్త్ పరివార్'లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు సుమారు 195 మంది మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ కూల్చొద్దు



ఇందల్వాయి: మండలంలోని లింగాపూర్ గ్రామంలోగల ఎస్సీవాడ వాటర్ ట్యాంక్‌ను కూల్చవద్దని గ్రామస్తులు కోరారు. గ్రామ కారోబార్ రవి ట్యాంక్‌ను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నాడని, పంచాయతీ కార్యదర్శి కూడా సహకారం అందిస్తున్నట్లు కాలనీ వాసులు సోమవారం ఆరోపించారు. ఉన్నత అధికారులు స్పందించి ట్యాంక్‌ను కాపాడాలని కోరారు.

సమాచారం..

కొటేషన్లకు ఆహ్వానం

నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో భక్తులు కొట్టిన టెంకాయ ప్రసాదాలను పోగుచేయడానికి కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీరాంరవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1, 2025 నుంచి 30 సెప్టెంబర్ 2026 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు నేడు ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించబడు వేలంలో పాల్గొనాలని అన్నారు. వారు ముందస్తుగా రూ.5వేలు చెల్లించాలని కోరారు.